# సాక్షి
## నిజామాబాద్

గురువారం । 17 । జూలై । 2025






**ప్రముఖులతో గవర్నర్..**

కవులు, కళాకారులు, రచయితలు, క్రీడాకారులు, సామాజిక కార్యకర్తలు, ఆదర్శ రైతులతో గవర్నర్ వర్మ ఇష్టాగోష్టి నిర్వహించారు.

- 8లో ▸



**యువకుడి దారుణ హత్య**

బిచ్కుంద మండల కేంద్రంలో యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. సమీప బంధువే అతడిని కత్తితో పొడిచి చంపాడు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.6 /24.4

**వాతావరణం**

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

# తెయూ విజయాలు ఆదర్శం

- రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు పొందిన తెలంగాణ యూనివర్సిటీ
- ఇక్కడి ప్రజల ఆకాంక్షలు, సామర్థ్యాలు వర్సిటీ అభివృద్ధిలో స్ఫూర్తినిస్తున్నాయి
- రెండో స్నాతకోత్సవంలో వర్సిటీ చాన్స్‌లర్, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- ముఖ్యఅతిథిగా హాజరైన ఐఐసీటీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్
- 113 మందికి గోల్డ్ మెడల్స్.. 157 మందికి డాక్టరేట్‌లు అందజేత



తెయూ కాన్వొకేషన్ వేదికపై జాతీయ గీతం ఆలపిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఐఐసీటీ మాజీ డైరెక్టర్ శ్రీవారి చంద్రశేఖర్, వీసీ యాదగిరిరావు తదితరులు

**తెయూ(డిచ్‌పల్లి):** రాష్ట్రం పేరుతో ఏర్పడిన తెలంగాణ యూనివర్సిటీకి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని వర్సిటీ చాన్స్‌లర్, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. తెయూ రెండో స్నాతకోత్సవాన్ని(కాన్వొకేషన్) బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. 2006లో ఆరు కోర్సులతో ప్రారంభమైన తెయూ.. నేడు ఏడు విభాగాలు, 24 ఉప విభాగాలుగా 31 కోర్సులతో కొనసాగుతోందన్నారు. డిచ్‌పల్లి మెయిన్ క్యాంపస్‌తోపాటు కామారెడ్డి జిల్లా భిక్కనూరు సౌత్ క్యాంపస్, సారంగపూర్ ఎడ్యుకేషన్ క్యాంపస్‌లలో విద్యా వికాసం చెందడం ఆనందంగా ఉందన్నారు. చైతన్యవంతమైన ఈ మట్టిలోని ప్రజల ఆకాంక్షలు, సామర్థ్యాలు యూనివర్సిటీ అభివృద్ధిలో స్ఫూర్తినిస్తున్నాయన్నారు. యూనివర్సిటీ సాధించిన విజయాలు, ప్రగతిపూర్వకమైన సంఘటనలు రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. గత 19 ఏళ్లలో వర్సిటీ అధికారులు అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకుల ఉమ్మడి కృషి, అంకితభావం అభివృద్ధిలో ప్రతిబింబిస్తోందన్నారు.



ప్రసంగిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

2023 – 24 రాష్ట్ర ఆర్థిక సర్వే ప్రకారం 51 శాతం పట్టభద్రులు దేశానికి నైపుణ్యాల కొరత తీరుస్తూ ఉద్యోగాలు పొందుతున్నారన్నారని గవర్నర్ వివరించారు. తెలంగాణ యూనివర్సిటీ ఆశాజనకమైన పారిశ్రామిక, విద్యాపరమైన సంబంధాలతో ముందుకు పోవడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ చెప్పినట్లు విద్య యొక్క అంతిమ లక్ష్యం సృజనాత్మకమైన మానవున్ని తయారు చేయడంతోపాటు ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొంటూ చారిత్రాత్మకమైన అభివృద్ధిని స్పృశించడమని పేర్కొన్నారు.

కాన్వొకేషన్‌కు హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ముందుగా బెటాలియన్ పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. కాన్వొకేషన్‌కు రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో తెయూ రిజిస్ట్రార్ ఎం.యాదగిరి, డీన్స్ ఘంటా చంద్రశేఖర్, కే.అపర్ణ, జి.రాంబాబు, కే.లావణ్య, ఎం.శ్రీనివాస్, కే.సంపత్‌కుమార్, ప్రిన్సిపాల్ ప్రవీణ్ మామిడాల, ప్రొఫెసర్‌లు ఆరతి, కనకయ్య, విద్యావర్ధిని, అరుణ, ఆంజనేయులు, నాగరాజు, పీ ఆర్‌వో పున్నయ్య, ఏపీఆర్‌వో అబ్దుల్ ఖవి, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, పరిశోధకులు తదితరులు పాల్గొన్నారు.

### బంగారు పతకాలు.. డాక్టరేట్ పట్టాలు

2014 నుంచి 2023 వరకు 15 విభాగాల్లో 130 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపగా, దరఖాస్తు చేసుకున్న 113 మందికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యఅతిథి ప్రొఫెసర్ చంద్రశేఖర్ చేతుల మీదుగా స్నాతకోత్సవంలో బంగారు పతకాలు అందజేశారు. అలాగే 2017 నుంచి 2025 జూన్ వరకు ఏడు విభాగాల్లో పరిశోధనలు పూర్తి చేసుకున్న 157 మంది పరిశోధకులకు పీహెచ్‌డీ (డాక్టరేట్) పట్టాలను అందజేశారు.

**క్షుణ్ణంగా తనిఖీలు**

తెయూ క్రీడామైదానం లో ఏర్పాటు చేసిన కాన్వొకేషన్ ప్రాంగణంలో పోలీస్ కమిషనర్ సాయిచైతన్య ఆధ్వర్యంలో స్నిఫర్ డాగ్ బృందం, బాంబు డిస్పోజబుల్ టీం, ఇంటిలిజెన్స్ అధికారులు బందోబస్తు నిర్వహించారు. ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసి నిర్వహించిన లోనికి అనుమతించారు.



గోల్డ్‌మెడల్ సాధించిన మల్లికకు సర్టిఫికెట్ అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

### ఆందోళన చెందొద్దు.. అవకాశాలను అందిపుచ్చుకోవాలి



కాన్వొకేషన్‌కు ముఖ్యఅతిథిగా హాజరైన భారత రసాయన శాస్త్ర సాంకేతిక సంస్థ (ఐఐసీటీ) మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీవారి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. యనివర్సిటీ నుంచి బయటకు వెళ్లిన ప్రతి విద్యార్థికి ఆందోళనతో పాటు అవకాశాలు కలిగిన ఎన్నో దారులు కనిపిస్తాయన్నారు. ఆందోళన చెందకుండా అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. వారి వారి శక్తి సామర్థ్యాలు, అభిరుచి మేరకు కొందరు పరిశోధకులుగా మరికొందరు పారిశ్రామికవేత్తలుగా, వ్యవస్థాపకులుగా, ప్రజాసేవకులుగా, విద్యావేత్తలుగా ఉన్నతంగా స్థిరపడుతున్నారన్నారు. విద్యార్థులు ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సింది జీవితమనేది పందెం లాంటిది కాదని ఇది ఒక ప్రయాణం మాత్రమేనని వివరించారు. ప్రయాణానికి సమయస్ఫూర్తితో తీసుకునే నిర్ణయాల మీద భవిష్యత్ ఆధారపడుతుందన్నారు. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అన్ని రంగాలపై ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు.

### ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల ఏర్పాటుకు కృషి



తెయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ టీ.యాదగిరిరావు మాట్లాడుతూ.. వర్సిటీలో ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నూతనంగా పరిపాలనా భవనం, 500 మంది విద్యార్థినులకు సరిపడా అన్ని రకాల వసతులు ఉండే బాలికల వసతి గృహం, వేయి మంది సామర్థ్యం కలిగిన ఆడిటోరియం, క్రీడామైదానం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తెయూ పరిధిని నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు విస్తరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. యూనివర్సిటీ అభివృద్ధి, జిల్లా ప్రజాప్రతినిధులతోపాటు బోధన, బోధనేతర సిబ్బంది సమష్టి కృషిపైనే ఆధారపడుతుందని అన్నారు.



బెటాలియన్‌లో మొక్కనాటి నీరు పోస్తున్న గవర్నర్, పక్కన రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి



కాన్వొకేషన్‌లో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి, ఆర్మూర్, అర్బన్ ఎమ్మెల్యేలు పైడి రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ విద్యాసంస్థల అధినేతలు, ప్రొఫెసర్లు



బెటాలియన్‌లో పోలీసుల గౌరవవందనం స్వీకరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



గోల్డ్‌మెడల్స్ సాధించిన విద్యార్థులు

## న్యూస్‌రీల్

### కత్తులు చూపి దారి దోపిడీ

- ద్విచక్ర వాహనం స్టార్ట్‌కాకుండా వైర్ల కత్తిరింపు
- రూ.3.50 లక్షలు అపహరణ
- కోనాపూర్ శివారులో ఘటన



**కమ్మర్‌పల్లి:** వరికోత యంత్రం కొనుగోలు చేసేందుకు వెళ్తున్న వారి ద్విచక్ర వాహనాన్ని అడ్డగించిన దుండగులు కత్తులు చూపి బెదిరించి రూ.3.50 లక్షలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన కమ్మర్‌పల్లి మండ లం కోనాపూర్ గ్రామ శివారులో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం జోగినిపల్లికి చెందిన కొమ్ము లక్ష్మీనారాయణ తన మిత్రుడైన మేడిపల్లి మండలం విలాసబాద్ గ్రామానికి చెందిన జలంధర్‌తో కలిసి హార్వెస్టర్ (వరికోత యంత్రం) కొనుగోలు చేసేందుకు ద్విచక్ర వాహనంపై భీమ్‌గల్ మండలం పల్లికొండకు వెళ్తున్నారు. కోనాపూర్ శివారులో వారి ద్విచక్ర వాహనాన్ని స్కూటీపై వచ్చిన ఇద్దరు దుండగులు అడ్డగించారు. కత్తులు చూపి బెదిరించి వారి వద్ద నుంచి రూ.3.50 లక్షల నగదు, రెండు సెల్ ఫోన్‌లు లాక్కున్నారు. ద్విచక్ర వాహనం స్టార్ట్ కాకుండా వైర్లను కత్తిరించి అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో బాధితులు రోడ్డు వెంట వాహనదారుడిని ఆపి ఫోన్ ద్వారా డయల్ 100కు సమాచారం అందించారు. భీమ్‌గల్ సీఐ పొన్నం సత్యనారాయణ, కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని బాధితుల నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



**సుభాష్‌నగర్:** నిజామాబాద్ నగరంలోని వినాయక్‌నగర్ 33 కేవీ కొత్త టవర్ లైన్ నిర్మాణ పనుల నేపథ్యంలో గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్–1 ఏడీఈ ఆర్ చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా పలు ప్రాంతాల్లో ప్రమాదకరంగా ఉన్న స్తంభాలు మార్చనున్నామని పేర్కొన్నారు. వినాయక్‌నగర్ సబ్‌స్టేషన్ నుంచి 11 కేవీ గాయత్రినగర్ ఫీడర్ పరిధిలో ఉన్న 100 ఫీట్ల రోడ్, కామాక్షి అపార్ట్‌మెంట్, సాయినిలయం, మీనాక్షి పద్మావతి అపార్ట్‌మెంట్, భవానీనగర్, డీటీఆర్ ఎస్ఎస్ 9, 10, 11, 12, 16, 22, 23, గాయత్రినగర్ చింత చెట్టు మైసమ్మ, ఆకుల పాపన్న రోడ్డు, విశ్వవికాస్ స్కూల్, సాయినగర్, కాశీనగర్, బీమరాయ ఆలయం, కట్టమైసమ్మ బాల హనుమాన్ ఆలయ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిర్ణీత సమయంలో నిలుస్తుందని, వినియోగదారులు సహకరించాలని చంద్రశేఖర్ కోరారు.

### జిల్లాలో 307 ఎంపీటీసీ స్థానాలు

- 31కి చేరిన జెడ్పీటీసీ, ఎంపీపీ సీట్లు

**నిజామాబాద్ రూరల్:** జిల్లాలో 307 ఎంపీటీసీ స్థానాలు, 31 జెడ్పీటీసీలు, 31 ఎంపీపీలు ఖరారు చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. గతంలో 27 ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 31కి పెరిగింది. కొత్తగా ఆలూర్, డొంకేశ్వర్, సాలూర, పొతంగల్ స్థానాలను ఏర్పాటు చేశారు. అలాగే జిల్లాలో ఎంపీటీసీ స్థానాల సంఖ్య 299 నుంచి 307కు చేరింది. రాష్ట్రంలో నల్గొండ జిల్లా తర్వాత అత్యధిక స్థానాలు నిజామాబాద్ జిల్లాలోనే ఉన్నాయి. జిల్లాలో 545 గ్రామపంచాయతీలు, 5022 వార్డుస్థానాలు ఉన్నాయి.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**సుభాష్‌నగర్:** రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, వారి ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా పథకాలు అమలు చేస్తోందని నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి అన్నారు. నగరంలోని నిజామాబాద్ మార్కెట్ కమిటీలో చైర్మన్ ముప్ప గంగారెడ్డి అధ్యక్షతన బుధవారం పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు రూ.97లక్షలు మంజూరు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డికి చైర్మన్‌తోపాటు పాలకవర్గ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. నిజామాబాద్ మార్కెట్ కమిటీకి పూర్వవైభవం తీసుకొచ్చేలా చర్యలు చేపడుతున్నామన్నారు. మార్కెట్ పరిధిలోని మల్లారం, నవీపేట్, నందిపేట్, మాక్లూర్ గోదాముల స్థలాలు కబ్జా కాకుండా ప్రహరీల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని సమావేశంలో తీర్మానం చేశామన్నారు. గాంధీగంజ్‌లోని కూరగాయల రిటైల్ మార్కెట్ వ్యాపారులకు మడిగెలు కేటాయించాలని తీర్మానించామన్నారు. అందుకోసం అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు పంపిస్తున్నామని పేర్కొన్నారు.

**మార్కెట్‌యార్డులో వన మహోత్సవం**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవంలోభాగంగా మార్కెట్‌యార్డులో చైర్మన్ గంగారెడ్డి మొక్కలు నాటారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటుతామన్నారు. వైస్ చైర్మన్ జే రాంచందర్, సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ అపర్ణ, డీఎంవో గంగు, డైరెక్టర్లు పాల్గొన్నారు.



పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి

## టీబీ ముక్త్ భారత్‌లో భాగస్వాములు కావాలి

- సమష్టి కృషితోనే క్షయ నిర్మూలన
- టీబీపై ప్రజల్లో అవగాహన కల్పించాలి
- దాతల సహకారంతో పేషెంట్లకు పోషకాహార కిట్లను అందజేయాలి
- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపు





సమావేశంలో పాల్గొన్న జిల్లా అధికారులు.. మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**నిజామాబాద్‌అర్బన్:** క్షయ రహితంగా దేశాన్ని తీర్చిదిద్దాలనే బృహత్తర సంకల్పంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో బుధవారం టీబీ ముక్త్ భారత్ అభియాన్‌పై కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, అధికారులతో కలిసి గవర్నర్ సమీక్షించారు.

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, సమష్టి కృషితోనే సమగ్ర ప్రగతి కల సాకారమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక ప్రతిభ కలిగి ఉంటారని, దానిని సమాజ ప్రగతికి వినియోగించాలని కోరారు. సామాజిక, సాహితీ, సేవా, క్రీడా తదితర అన్ని రంగాల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న వారు, తమతమ రంగాల ద్వారా ఆయా మాధ్యమాలను ఉపయోగిస్తూ క్షయ నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు పొందిన జిల్లాకు చెందిన మాలావత్ పూర్ణ, గుగులోత్ సౌమ్యను 'టీబీ ముక్త్ భారత్ అభియాన్'కు తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్‌లుగా వ్యవహరించాలని గవర్నర్ కోరారు. కవులు, రచయితలు తమ రచనల ద్వారా, కళాకా రులు ప్రదర్శనల ద్వారా ప్రజలను టీబీ నిర్మూలన దిశగా చైతన్యపర్చాలని పిలుపునిచ్చారు. జిల్లా యంత్రాంగం, రెడ్‌క్రాస్ సొసైటీ సమన్వయం ఏర్పర్చుకుని, పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. టీబీ నిర్ధారణ అయిన పేషెంట్లకు దాతల ద్వారా పోషక ఆహార కిట్లను అందించాలన్నారు.

జిల్లా భౌగోళిక స్వరూపం, స్థితిగతులు, ప్రాముఖ్యతను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ముందుగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గవర్నర్ దృష్టికి తెచ్చారు. క్షయ నిర్మూలన చర్యల్లో భాగంగా హై రిస్క్ గ్రూప్‌లో ఉన్న వారందరికీ స్క్రీనింగ్, ఎక్స్ రే చేయిస్తున్నామని, వ్యాధి లక్షణాలు ఉన్నవారికి తెమడ పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తున్నామని తెలిపారు. క్షయ నిర్మూలన కోసం చేసిన విశేష కృషికి గాను 2022–23 సంవత్సరానికి గాను జిల్లాకు గోల్డ్ మెడల్ దక్కిందని అన్నారు. తలసేమియా బాధితులకు అవసరమైన బ్లడ్ యూనిట్లను రెడ్ క్రాస్ ద్వారా సమకూరుస్తున్నామని, వృద్ధుల కోసం రెడ్ క్రాస్, జిల్లా యంత్రాంగంల సంయుక్త ఆధ్వర్యంలో వద్ధాశ్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి, పోలీస్ కమిషనర్ సాయిచైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నేడు వేల్పూర్‌లో దంగల్!

- మాటల కత్తులు దూసుకుంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు
- ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి విమర్శల నేపథ్యంలో కనువిప్పు పేరిట కార్యక్రమం చేపట్టిన కాంగ్రెస్
- తాము సిద్ధమేనని.. పథకాలు అందని రైతులను తీసుకొస్తామంటున్న బీఆర్ఎస్
- ప్రశాంత్‌రెడ్డితోపాటు బీఆర్ఎస్ కార్యకర్తలకు కనువిప్పు కలిగిస్తాం..: డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

**సాక్షి ప్రతినిధి, నిజామాబాద్:** బాల్కొండ నియోజకవర్గంలో రాజకీయంగా వాతావరణం వేడెక్కింది. గురువారం వేల్పూర్‌లో కాంగ్రెస్ పార్టీ 'ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి కనువిప్పు' పేరిట గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన కార్యక్రమం వేడి పుట్టిస్తోంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు సై అంటే సై అంటూ కత్తులు దూసుకుంటున్నాయి. దీంతో ఒక్కసారిగా కాక రేగి.. పసుపు నేలలో సెగలు రగులుతున్నాయి. గల్ఫ్ కార్మికుల సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి విమర్శలు చేసిన నేపథ్యంలో రగడ మొదలైంది. దీంతో స్పందించిన డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ప్రశాంత్‌రెడ్డి విమర్శలను సవాల్‌గా తీసుకున్నారు. ఏడాదిన్నర కాలంలో తమ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి ఏమిటో చూపిస్తామని చెబుతున్నారు. గల్ఫ్ కార్మికుల కోసం ఎన్ఆర్ఐ సెల్ ఏర్పాటు చేయడంతో పాటు చనిపోయిన 56 మంది గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందించినట్లు కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. బాల్కొండ నియోజకవర్గానికి చెందిన పరిహారం అందిన గల్ఫ్ కార్మికుల కుటుంబాలను తోలుకొస్తామని కాంగ్రెస్ కార్యకర్తలు చెబుతున్నారు. వేల్పూర్ గాంధీ విగ్రహం వద్ద 'ప్రశాంత్ రెడ్డికి కనువిప్పు' పేరిట కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డితో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ సుంకేట అన్వేష్‌రెడ్డి పాల్గొనేందుకు సిద్ధమయ్యారు.



మానాల మోహన్‌రెడ్డి



వేముల ప్రశాంత్‌రెడ్డి

**పథకాలు రానివారిని తీసుకొస్తాం.. బీఆర్ఎస్**

అధికార కాంగ్రెస్ పార్టీ సంక్షేమం విషయంలో విఫలమైందని, తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు మండిపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టే కార్యక్రమానికి ప్రతిగా కార్యక్రమం చేస్తామని బీఆర్ఎస్ శ్రేణులు చెబుతున్నాయి. సై అంటే సై అంటూ సవాల్‌ను స్వీకరిస్తున్నామని చెబుతున్నారు. పరిహారం అందని గల్ఫ్ బాధిత కుటుంబాలను, రుణమాఫీ, రైతుభరోసా రాని రైతులను తీసుకొస్తామన్నారు. బోనస్ రాని రైతులను పిలిస్తే భారీగా వస్తారంటున్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో ఆధిపత్య పోరులో నెగ్గే లక్ష్యంతోనే డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసినట్లు గులాబీ కార్యకర్తలు అంటున్నారు. హామీలు నెరవేర్చలేక, ప్రజల దృష్టిని మరల్చేందుకే వేల్పూర్ కార్యక్రమం చేపట్టారంటున్నారు. అమలు కాని హామీల విషయంలో బాధ్యతాయుతమైన ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ప్రశాంత్‌రెడ్డి నిలదీస్తే తట్టుకోలేకపోవడం ఏమిటన్నారు. తాము తీసుకొచ్చినవారికి పథకాలు ఇచ్చినట్లు నిరూపించలేకపోతే మానాల మోహన్‌రెడ్డి రాజకీయ సన్యాసం తీసుకుంటారా అని అంటున్నారు. కాంగ్రెస్ పార్టీకి కనువిప్పు చేస్తామని అంటున్నారు. ఈ నేపథ్యంలో వేల్పూర్‌లో గరంగరం వాతావరణం నెలకొంది.

**ప్రశాంత్‌రెడ్డి ఇల్లు ముట్టడిస్తాం..: మానాల**

కాంగ్రెస్ పార్టీ అన్నివర్గాల్లో అర్హులైనవారికి సంక్షేమ పథకాలు అందిస్తోంది. గల్ఫ్ కార్మికులకు ఇప్పటికే పరిహారం చెల్లించడం జరిగింది. ఇందిరమ్మ ఇళ్లు వేగంగా నిర్మాణం అవుతున్నాయి. బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రశాంత్‌రెడ్డి మాటలు గుడ్డిగా నమ్మి మోసపోవద్దు. ప్రశాంత్‌రెడ్డి పిలుపునకు స్పందించి వచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలకు కూడా కళ్లు తెరిపిస్తాం. ఎమ్మెల్యే ప్రతి విమర్శను చూసి బీఆర్ఎస్ వాళ్లు గుడ్డిగా అనుసరించొద్దు.గాంధీ విగ్రహం వద్ద ప్రశాంత్ రెడ్డి కోసం ఎదురుచూస్తాం. అవసరమైతే ప్రశాంత్ రెడ్డి ఇంటివద్దకొస్తాం. కనువిప్పు కలిగిస్తాం.

### పోలీసుశాఖ ఆంక్షలు

**వేల్పూర్:** శాంతిభద్రతలకు విఘాతం కలకుండా వేల్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఆంక్షలు విధిస్తూ సీపీ సాయిచైతన్య గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు వేల్పూర్ ఎస్సై సంజీవ్ బుధవారం రాత్రి తెలిపారు. ఎక్కడ కూడా నలుగురు కన్నా ఎక్కువ సంఖ్యలో గుమిగూడొద్దని పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులను అధిగమించిన వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు. కాగా, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు పొందని లబ్ధిదారులతో కలిసి నిర్వహించే పరిచయ కార్యక్రమానికి అనుమతించాలని వేల్పూర్ మండల బీఆర్ఎస్ నాయకులు వేల్పూర్ ఎస్సై సంజీవ్‌కు వినతి పత్రం అందజేశారు.


మాస్ కమ్యూనికేషన్ విభాగంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుంటున్న శ్రీనివాస్ గౌడ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పిట్ల సరిత


గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, చిత్రంలో గడుగు గంగాధర్


గవర్నర్‌కు జ్ఞాపికను అందిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

# ప్రముఖులతో గవర్నర్ ఇష్టాగోష్టి

- కలెక్టరేట్‌లో ఫొటో ఎగ్జిబిషన్ తిలకించిన జిష్ణుదేవ్ వర్మ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ బుధవారం నిజామాబాద్ సమీకృత కలెక్టరేట్‌లో జిల్లాకు చెందిన ప్రఖ్యాత కవులు, కళాకారులు, రచయితలు, జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందిన క్రీడాకారులు, సామాజిక కార్యకర్తలు, ఆదర్శ రైతులు, ఇతర ప్రముఖులతో ఇష్టాగోష్టి నిర్వహించారు. తెలంగాణ యూనివర్సిటీ స్నాతకోత్సవం అనంతరం కలెక్టరేట్‌కు వచ్చిన గవర్నర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యేలు పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్ రెడ్డి, కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయి చైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ గవర్నర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు తీరుపై తెలిపేందుకు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను గవర్నర్ తిలకించారు. కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి ఫొటో ఎగ్జిబిషన్ ఆధారంగా ఆయా శాఖల కార్యక్రమాల వివరాలను తెలిపారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాకు చెందిన ప్రముఖులతో ముచ్చటించారు. ఆయా రంగాల్లో సేవలందిస్తున్న వారి గురించి గవర్నర్ పేరుపేరున వివరాలు తెలుసుకొని అభినందించారు. అనంతరం గవర్నర్ ఆయా రంగాల వారితోపాటు జిల్లా అధికారులతో కలిసి ఫొటో సెషన్‌లో పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, వేదికపై కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయి చైతన్య, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్ రెడ్డి, అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, అంకిత్



మాట్లాడుతున్న మలావత్ పూర్ణ, గుగులోత్ సౌమ్య


సీనియర్ సిటిజన్స్‌తో ముచ్చటిస్తున్న గవర్నర్

## గవర్నర్‌తో ఇష్టాగోష్టిలో పాల్గొన్నది వీరే..

పిన్న వయసులో ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన మలావత్ పూర్ణ, అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారిణి గుగులోత్ సౌమ్య, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రమేశ్ కార్తీక్ నాయక్, బల్లాష్టు మల్లేశ్ (థియేటర్ ఆర్టిస్ట్), కందకుర్తి యాదవరావు (చరిత్రకారులు), చిన్ని కృష్ణుడు (ఆదర్శ రైతు), అమృతలత (ప్రముఖ రచయిత), నాళేశ్వరం శంకరం (కవి), వీపీ. చందన్ రావు (కవి, రచయిత), అష్ట గంగాధర్ (జానపద కళాకారులు), పాయల్ కోట్గిర్కర్ (ప్రముఖ తబలా వాయిద్యకారులు), పంచరెడ్డి లక్ష్మణ్ (ప్రముఖ కవి), గణపతి అశోక శర్మ (అష్టావధాని), తల్లావజ్ఝల మహేశ్‌బాబు (ప్రముఖ కవి), కాసర్ల నరేశ్ రావు ( కవి, రచయిత), ఘనపురం దేవేందర్ (కవి, వ్యాఖ్యాత), డాక్టర్ డి.శారద (ప్రముఖ విద్యావేత్త, రచయిత), గంట్యాల ప్రసాద్ (సాహితీవేత్త), తిరుమల శ్రీనివాస్ ఆర్య (ప్రముఖ కవి), కత్తి గంగాధర్ (సాంస్కృతిక విభాగం విలేకరి), బొచ్కర్ ఓంప్రకాశ్ (కవి, అష్టావధాని), ఆరుట్ల శ్రీదేవి (సాహితీ పరిశోధకులు), శ్రీమన్నారాయణ చారి (కవి, ప్రముఖ వ్యాఖ్యాత), కళా లలిత (ప్రముఖ యాంకర్), బి.కళా గోపాల్ (కవి, రచయిత), మద్దుకూరి సాయిబాబు (సామాజిక సేవా కార్యకర్త, రచయిత), చింతల గంగాదాస్ (కవి, వ్యాఖ్యాత), చింతల శ్రీనివాస్ గుప్తా (ప్రముఖ కవి), డాక్టర్ అన్నందాస్ జ్యోతి (విద్యావేత్త, రచయిత), కైరకొండ బాబు (ప్రముఖ చిత్రకారులు), సిర్ప లింగం (ప్రముఖ కళాకారులు), చిందు బాబయ్య (కళాకారులు), మహమ్మద్ రషీద్ (రేలా రే రేలా ఫేం కళాకారుడు), సాయి లవోలా (జానపద కళాకారులు), జయలక్ష్మి (నాట్య గురువు), గంగాదేవి (జానపద గాయని), పసునూరి వినయ్ కుమార్ (కొరియోగ్రఫర్), టీ స్వప్నరాణి (మ్యూజిక్ అధ్యాపకురాలు), కే సంతోష్ కుమార్ (వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్), అష్ఫాక్ ఆస్పీ (ఉర్దూ కవి, వ్యాఖ్యాత), దారం గంగాధర్ (రచయిత) తదితరులున్నారు.


వివిధ రంగాల ప్రముఖులు, అధికారులతో గవర్నర్


ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న గవర్నర్


పోలీసులతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీపీ సాయి చైతన్య


బెటాలియన్‌లో గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న విద్యార్థిని

## మెడల్స్ ప్రదానం

తెయూలో బుధవారం నిర్వహించిన కాన్వొకేషన్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా విద్యార్థులు మెడల్స్ అందుకున్నారు. ఈ సందర్భంగా వారి అభిప్రాయాలు..


గోల్డ్ మెడల్ సర్టిఫికెట్ అందుకుంటున్న విద్యార్థులు

### జూనియర్లకు స్ఫూర్తిగా..



తెలంగాణ యూనివర్సిటీ బోటనీ విభాగంలో 2013–15 విద్యాసంవత్సరంలో క్లాస్ టాపర్‌గా నిలిచా. ఇన్ని సంవత్సరాల తర్వాత రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకోవడం సంతోషంగా ఉంది. ఈ మెడల్ మా జూనియర్లకు స్ఫూర్తిగా ఉంటుందని ఆశిస్తున్నాను.

-టీ.లావణ్య, బోటనీ

### మంచి పేరు తేవాలి



వర్సిటీ అధ్యాపకుల బోధనలు చక్కగా విని విద్యార్థులు ఉత్తమ ప్రతిభ సాధించడం ద్వారా తాము చదువుకున్న యూనివర్సిటీకి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి. 2014–16 విద్యాసంవత్సరంలో పీజీ పూర్తి చేసి 9 సంవత్సరాల తర్వాత గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకోవడం ఆనందంగా ఉంది.

- ఎస్.శృతి, బోటనీ

## బెటాలియన్‌ను సందర్శించిన గవర్నర్


గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి


గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీపీ సాయిచైతన్య

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): తెలంగాణ యూనివర్సిటీ రెండో స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు బుధవారం జిల్లాకు వచ్చిన వర్సిటీ చాన్స్‌లర్, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముందుగా డిచ్‌పల్లిలోని టీజీఎస్పీ ఏడో బెటాలియన్‌ను సందర్శించారు. గవర్నర్‌కు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయి చైతన్య, వీసీ యాదగిరి రావు, బెటాలియన్ కమాండెంట్ పీ సత్యనారాయణ, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, విద్యార్థినులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ బెటాలియన్ ఆవరణలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. కాసేపు విశ్రాంతి అనంతరం గవర్నర్ యూనివర్సిటీకి బయలుదేరి వెళ్లారు. కాన్వొకేషన్ ముగిసిన తర్వాత గవర్నర్ తిరిగి బెటాలియన్‌కు చేరుకొని భోజనం చేసి కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. అనంతరం నిజామాబాద్ నగరంలోని కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లారు. అసిస్టెంట్ కమాండెంట్లు శరత్‌కుమార్, కేపీ సత్యనారాయణ, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీసీ యాదగిరిరావు


ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్


కమాండెంట్ సత్యనారాయణ

### రెండుసార్లు పిలుపు వచ్చినా..



తెయూ మాథ్స్ విభాగంలో 2016–18 విద్యాసంవత్సరంలో పీజీ పూర్తయింది. గతంలో కాన్వొకేషన్‌కు వచ్చి గోల్డ్‌మెడల్ తీసుకోవాలని రెండుసార్లు పిలుపు వచ్చినా తర్వాత కార్యక్రమం రద్దయింది. పదేళ్ల కాలంలో ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ విభాగంలో మొదటి గోల్డ్ మెడల్ సాధించడం గర్వంగా ఉంది.

- జీ ప్రమోద్ కుమార్

### చదువులోనూ ముందంజ..



తెలంగాణ యూనివర్సిటీ అప్లయిడ్ ఎకనామిక్స్ విభాగంలో 2016–2021 విద్యాసంవత్సరంలో ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సు పూర్తయింది. వర్సిటీ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూనే చదువులోనూ ముందుండి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకోవడం సంతోషంగా ఉంది. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శిగా విద్యారంగ సమస్యలపై పోరాడుతున్నాను.

- రాచకొండ విఘ్నేశ్

### ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్‌లో ఓవరాల్ టాపర్‌గా..



తెలంగాణ యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ విభాగంలో 2017–19 విద్యాసంవత్సరానికి ఓవరాల్ టాపర్‌గా నిలిచి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకోవడం ఆనందంగా ఉంది. బయోటెక్నాలజీ విభాగంలోని ప్రయోగశాలలు మెరుగుపరిస్తే మరింత మంది విద్యార్థులు పతకాలు సాధిస్తారు.

- పరుచూరి సౌజన్య

### తల్లిదండ్రులను అనుమతిస్తే బాగుండేది..



వర్సిటీ ఉన్నతాధికారులు, అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఐదేళ్ల తర్వాత కూడా ఫోన్ చేసి పిలిచారు. 15 రోజుల ముందు నుంచి కాన్వొకేషన్‌లో ఎలా మెలగాలనే విషయాలపై అవగాహన కల్పించారు. గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ తీసుకునేటప్పుడు వేదికపైకి విద్యార్థితోపాటు తల్లిదండ్రులను అనుమతిస్తే బాగుండేది.

-గట్టు సాయి వశిష్ఠ, ఎంబీఏ

### తెలుగు భాషపై మక్కువతో..



నా మాతృభాష ఉర్దూ అయినప్పటికీ చిన్నప్పటి నుంచి తెలుగు భాషపై మక్కువ కలిగింది. తెయూలో ఎంఏ తెలుగు అధ్యయన శాఖ (2013–15)లో చేరాను. బాగా చదువుకుని గోల్డ్‌మెడల్ సాధించగలిగాను. ఇదే యూనివర్సిటీలో తెలుగు విభాగంలో డాక్టరేట్ సాధించాను. గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకోవడం జీవితంలో మరిచిపోలేని రోజు.

- సయ్యద్ అఫ్రీన్ బేగం, తెలుగు

## క్రైం కార్నర్

### రైలు కింద పడి యువకుడి మృతి

బోధన్: ఎడపల్లి– జాన్కంపేట రైల్వేస్టేషన్ల మధ్య బుధవారం గుర్తు తెలియని రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడు (25) మృతి చెందినట్లు నిజామాబాద్ రైల్వేస్టేషన్ మేనేజర్ సాయి కిశోర్ తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్సై సాయిరెడ్డి నంబర్ 87126 58591కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

### చికిత్స పొందుతూ వృద్ధురాలు..

రెంజల్(బోధన్): మండలంలోని బోర్గాం గ్రామానికి చెందిన కమ్మరి శాంతమ్మ(76) చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. మంగళవారం సాయంత్రం నిజామాబాద్ నుంచి బోర్గాం గ్రామానికి శాంతమ్మ బస్సులో వచ్చింది. బస్సు దిగుతుండగా చీర కొంగు తట్టుకొని బస్సు వెనుక టైరు కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు శాంతమ్మను నిజామాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబీకులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

### యువకుడి దారుణ హత్య

- ఘటన స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ విఠల్‌రెడ్డి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

బిచ్కుంద(జుక్కల్): బిచ్కుంద మండల కేంద్రంలో బుధవారం ఓ యువకుడి దారుణ హత్య కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బిచ్కుందలోని ఊరడమ్మ గల్లీకి చెందిన అడికె రమేశ్(35)కు పదేళ్ల క్రితం మహాదేవితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. గత సంవత్సరం నుంచి భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో మహాదేవి పుట్టింటికి వెళ్లింది. దీంతో అప్పటి నుంచి రమేశ్ మారేడు గుడి వద్ద ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ జీవిస్తున్నాడు. కాగా, పెద్ద దేవాడకు చెందిన సమీప బంధువు కాశీనాథ్ బుధవారం ఉదయం హైదరాబాద్ నుంచి వచ్చి రమేశ్ ఇంటి తలుపు కొట్టాడు. రమేశ్ తలుపు తీయడంతో వెంటనే కాశీనాథ్ తన వెంట తెచ్చుకున్న కత్తితో విచక్షణా రహితంగా దాడి చేశాడు. దీంతో రమేశ్ అక్కడికక్కడే మరణించాడు. విషయం తెలుసుకున్న బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి, సీఐ రవికుమార్, ఎస్సై మోహన్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కాశీనాథ్ భార్యతో వివాహేతర సంబంధం ఉందనే కారణంతోనే తన కొడుకును హత్య చేసినట్లు రమేశ్ తల్లి గంగామణి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు.


సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

PASSPORT MISSING

BANDI BHOOMESHWAR S/o. BANDI GANGARAM జాన్కంపేట్ ఇ.నెం. 1-31. జాన్కంపేట్ నుండి వేల్పూర్‌కు బైక్‌పై వెళ్తుండగా PP No.R5935081 పాస్‌పోర్ట్ పోయినది. దొరికినయెడల సంప్రదించండి: 8465056132.
[SCA25006319]

WANTED

షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడి వార్డెన్స్, లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. Ph: 8985114453, 9391036931.
[HA-16101]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/- రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



























